జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

# జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA

దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥ సంపుటి:1 ॥ సంచిక: 108 ॥ శనివారం ॥ 12-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

12 సెప్టెంబర్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:17 తిథి పాడ్యమి ఉ. 7:47 వరకు తరువాత విదియ సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) మ. 12:54 వరకు తరువాత హస్త యోగం శుభ మ. 3:05 వరకు కరణం బవ ఉ. 7:47 వరకు భాలవ రా. 7:27 వరకు వర్జ్యం రా. 9:23 నుండి రా. 11:00 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:33 వరకు రాహుకాలం ఉ. 9:09 నుండి ఉ. 10:41 వరకు యమగండం మ. 1:43 నుండి మ. 3:14 వరకు గుళికాకాలం ఉ. 6:07 నుండి ఉ. 7:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు తె. 5:49 నుండి ఉ. 7:23 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:36 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున








# ప్రజా సంతృప్తే లక్ష్యం

## కలెక్టర్లకు కీలక దిశానిర్దేశం చేసిన చంద్రబాబు.. పాలనలో ఏఐ, డీప్ టెక్నాలజీ వినియోగంపై ఫోకస్

### ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి.. సానుకూల దృక్పథం పెంచాలని అధికారులకు సూచన

ప్రభుత్వ పాలనలో ప్రజా సంతృప్తే అంతిమ లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పాలనలో ఆధునిక సాంకేతికత వినియోగం, ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల దృక్పథం పెంపొందించడం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజలకు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు కనిపించినప్పుడే పాలనకు నిజమైన అర్థం వస్తుందని పేర్కొన్నారు.

అమరావతి, సెప్టెంబర్ 11 : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు వచ్చే దరఖాస్తులను పూర్తి సంతృప్తికరంగా పరిష్కరించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచూ గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ప్రతి నెల కనీసం నాలుగుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే అనేక సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. పాలనలో టెక్నాలజీ వినియోగానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు తరువాయి 2 వ పేజీలో..

# వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టబోము

## ఆర్డీఎస్ఎస్ పథకంలో అలాంటి నిబంధన లేదన్న డిప్యూటీ సీఎం

### సోలార్ విద్యుత్, మైక్రో గ్రిడ్‌లపై ప్రభుత్వం దృష్టి: భట్టి



రాష్ట్రంలోని రైతుల వ్యవసాయ మోటార్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మీటర్లు ఏర్పాటు చేయబోమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ విషయాన్ని వెల్లడిం చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డీఎస్ఎస్ పథకంలో ఎక్కడా వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయాలనే నిబంధన లేదని, రైతుల్లో అనవసర భయాందోళనలు సృష్టించవద్దని సూచించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 11: రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ఏటా రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తోందని భట్టి తెలిపారు. అలాగే 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేందుకు మరో రూ.5 వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విధం గా సబ్సిడీల రూపంలో ప్రతి ఏడాది దాదాపు రూ.19 వేల కోట్లు ఖర్చవుతున్నాయని వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయం సమృద్ధి సాధించే అవకాశం ఉంటుందని భట్టి అభిప్రాయపడ్డారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్‌ను రాత్రి వేళల్లో కూడా వినియోగించుకునేలా బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్‌లతో మైక్రో గ్రిడ్‌లను ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తరువాయి 2 వ పేజీలో..

## పాలిటెక్నిక్ సమస్యలపై అధ్యయన నివేదిక

**జీవో 97పై సమగ్ర అధ్యయనం పూర్తి**

**విద్యార్థులు, లెక్చరర్ల అభిప్రాయాల సేకరణ**

**హై లెవల్ కమిటీకి నివేదిక: కవిత**

**విద్యార్థుల భవిష్యత్తుకు న్యాయం చేయాలన్న డిమాండ్**



హైదరాబాద్, సెప్టెంబర్ 11: జీవో నెం.97 మరియు పాలిటెక్నిక్ విద్యావ్య వస్థకు సంబంధించిన అంశాలపై తెలంగాణ రక్షణ సేన అధ్యయన కమి టీ సమగ్ర పరిశీలన నిర్వహించినట్లు ఆ సంస్థ చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, వివిధ లెక్చరర్ల సంఘాల ప్రతినిధులు, విద్యారంగ తరువాయి 2 వ పేజీలో..



## భూదందాలపై రేవంత్ సర్కార్‌ను నిలదీసిన కేటీఆర్

**సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు**

**22ఏ భూముల వ్యవహారంపై ఆరోపణలు**

**కొండా సురేఖ తొలగింపుపై సంచలన వ్యాఖ్యలు**

**తెలంగాణ భవన్‌లో బాధితులతో సమావేశం**

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి) సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత భూముల బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భూములను కాపాడాల్సిన వారే భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ తరువాయి 2 వ పేజీలో..



## త్రిప్రయార్ శ్రీరామస్వామిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్

**ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు**

**శ్రీరామ, శ్రీకృష్ణ, అయ్యప్ప స్వాములకు పట్టు వస్త్రాల సమర్పణ**

**దీపారాధన, మీనుట్టు, వేది వజిపాడు సేవల్లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి**

త్రిప్రయార్, సెప్టెంబర్ 11 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేరళ రాష్ట్రంలోని ప్రసిద్ధ త్రిప్రయార్ శ్రీరామస్వామి ఆలయాన్ని శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలాంబలం యాత్రలో ప్రముఖ క్షేత్రంగా గుర్తింపు పొందిన ఈ ఆలయంలో సంప్రదాయాల ప్రకారం స్వామివారిని దర్శించుకునితరువాయి 2 వ పేజీలో..



## పేదల గృహ కలను సాకారం చేసిన కాంగ్రెస్

**రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం**

**నిజామాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ టవర్స్**

**కేంద్ర బకాయిలను విడుదల చేయాలి: మహేష్ కుమార్ గౌడ్**

దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పేదల సొంతింటి కలను సాకారం చేసే గొప్ప కార్యక్రమంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం నిలిచిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

5

## స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

**షర్మిల ఆదేశాలతో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు**

అమరావతి, సెప్టెంబర్ 11 (డిజైనర్ టెక్ గురు (ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎన్నికల్లో పార్టీ ఉనికిని బలంగా చాటుకోవడంతో పాటు గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని నిర్ణయించిన ఆమె, రాష్ట్ర స్థాయిలో కీలక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ తరువాయి 2 వ పేజీలో..



## నేటి రాశి ఫలాలు

మేషం: వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఆర్థికంగా మరింత పురోగతి కలుగుతుంది. నూతన కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగమున నూతన అవకాశములు అందుతాయి. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు.

వృషభం: విద్యార్థుల ప్రయత్నాలు అనుకూలిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన మార్పులు ఉంటాయి. వివాదాలకు సంబంధించి విలువైన సమాచారం అందుతుంది. దైవదర్శనాలు చేసుకుంటారు. విందువినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

మిథునం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. మిత్రులతో అకారణ మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు తప్పవు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ సభ్యుల నుంచి ధనపరమైన ఒత్తిడి తప్పదు. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి.

కర్కాటకం: వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగయత్నాలు ముందుకు సాగవు. ఇంటాబయట బాధ్యతలు తప్పవు. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

సింహం: పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. బంధువులతో కీలక వ్యవహారాలలో చర్చలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వ్యాపారాలు మరింత అనుకూలిస్తాయి. విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

కన్య: వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నిరుద్యోగ యత్నాలు సానుకూలమౌతాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో సఖ్యత కలుగుతుంది.

తుల: వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆర్థిక సమస్యలు చికాకు పరుస్తాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. బంధువుల మాటలు మానసికంగా బాధిస్తాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు అధికమౌతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. స్వల్ప ఆరోగ్య సమస్యలు ఉంటాయి.

ధనస్సు: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నూతన వాహనయోగం ఉన్నది. పాతబాకీలు వసూలవుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

మకరం: కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. సంతాన విద్యా, ఉద్యోగయత్నాలు నిదానిస్తాయి. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం: ఉద్యోగాలలో అధికారులతో చర్చలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలలో సమస్యలు అధిగమిస్తారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుని కష్ట సుఖాలు పంచుకుంటారు. బంధు వర్గం నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

మీనం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారమున భాగస్థులతో వివాదాలు కలుగుతాయి. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ముఖ్యమైన పనులలో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. కొన్ని పనులలో శ్రమ పడినా ఫలితం ఉండదు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.






# ప్రజా సంతృప్తే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**

స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలన్నీ టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌తో పనిచేయాలని, ప్రతి రంగంలో డీప్ టెక్నాలజీని అమలు చేయాలని సూచించారు. దీని ద్వారా అదనపు అభివృద్ధి సాధించడంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చని చెప్పారు. డేటా లేక్‌లో కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేసేందుకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. ప్రతి శాఖ ఏఐ స్టాక్ టెక్నాలజీని వినియోగించాల్సిన అవసరం ఉందని, జీఎస్టీ రంగంలో ఇప్పటికే ఏఐ వినియోగం మంచి ఫలితాలు ఇస్తోందని వివరించారు. కోర్టుల్లో పేరుకుపోయిన కేసుల పరిష్కారానికి కూడా సాంకేతికతను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. లీగల్ ఏఐ స్టాక్‌ను ఉపయోగించడం ద్వారా న్యాయవ్యవస్థలో పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్ పాలన మొత్తం డేటా ఆధారితంగా, సాంకేతికత ఆధారితంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు సేవలందించే ప్రతి శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించే దిశగా అడుగులు వేయాలని సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందించేందుకు అధికారులు కృషి చేయాలని చంద్రబాబు అన్నారు. ప్రజలకు సేవలు సులభంగా అందినప్పుడే ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. లోటుపాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి సవరించుకోవాలని, సమర్థంగా పనిచేసే అధికారులను ప్రోత్సహించాలని సూచించారు. పనితీరు సరిగా లేని వారిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా హెచ్చరించారు.

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా స్పష్టమైన విధులతో కూడిన జాబ్ చార్ట్ రూపొందించాలని సూచించారు. కొందరిపై అధిక పనిభారం, మరికొందరిపై తక్కువ పనిభారం ఉన్న పరిస్థితిని సరిచేసి పనిని హేతుబద్ధీకరించాలని తెలిపారు. ప్రతి కార్యాలయానికి ఒక ఈవీ సైకిల్ అందించాలని కూడా ఆదేశించారు. ఇదే సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ జిల్లాల ఆర్థిక పరిస్థితులతో పాటు పాలనపై ప్రజల్లో ఉన్న సానుకూల దృక్పథానికి సంబంధించిన సమాచారాన్ని మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని కలెక్టర్లను కోరారు. మొత్తం మీద ప్రజా సమస్యల పరిష్కారం, టెక్నాలజీ వినియోగం, సమర్థవంతమైన పాలన ద్వారానే ప్రభుత్వ లక్ష్యాలు సాధ్యమవుతాయని సమావేశంలో స్పష్టమైంది.

# త్రిప్రయార్ శ్రీరామస్వామిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్

**మొదటి పేజీ తరువాయి**

ప్రత్యేక సేవల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న పవన్ కళ్యాణ్‌కు దేవస్థానం బోర్డు ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీరామస్వామి, శ్రీకృష్ణుడు, అయ్యప్పస్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామన్ తిరుమేని ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయంలో విశిష్ట సేవగా భావించే దీపారాధన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. దీపారాధన కోసం విరాళం అందజేసి స్వయంగా దీపాలు వెలిగించారు. అలాగే మీనుట్టు సేవలో భాగంగా తీర్వా నదిలో చేపలకు ఆహారం అందించారు. ఈ ఆచారం ద్వారా మత్స్యావతార రూపుడైన మహావిష్ణువుకు ఆహారం సమర్పించినట్లుగా భక్తులు విశ్వసిస్తారు. వేది వజిపాడు సేవలోనూ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సేవలో భాగంగా 1,001 టపాసులు పేల్చేందుకు అవసరమైన మొత్తాన్ని విరాళంగా సమర్పించారు. శ్రీరాముడికి హనుమంతుడు సీతాదేవి ఆచూకీ తెలియజేసిన సందర్భాన్ని గుర్తుచేసే ఆచారంగా ఈ సంప్రదాయం కొనసాగుతోందని ఆలయ వర్గాలు పేర్కొంటున్నాయి. అనంతరం దక్షిణామూర్తి, వినాయకుడు, అనంతపద్మనాభస్వామి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన పవన్ కళ్యాణ్, అయ్యప్పస్వామిని కూడా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సంప్రదాయాలను గౌరవిస్తూ అన్ని సేవల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. త్రిప్రయార్ శ్రీరామస్వామి ఆలయం ద్వాపర యుగం నుంచి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన క్షేత్రంగా భావించబడుతోంది. ఆలయానికి సమీపంలో ఆయుర్వేద చికిత్స పొందుతున్న పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం భక్తుల్లో ఆసక్తిని కలిగించింది.



## మీటర్లు పెట్టబోము

**మొదటి పేజీ తరువాయి**

తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ సహాయంతో ఈ ప్రాజెక్టులను అమలు చేయాలని ప్రయత్నించినప్పటికీ బ్యాటరీ స్టోరేజ్ ఖర్చులు అధికంగా ఉండటంతో ఆశించిన స్థాయిలో స్పందన రాలేదన్నారు. భవిష్యత్తులో సాంకేతికత అభివృద్ధి చెందడంతో బ్యాటరీల ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు మరింత వేగంగా ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ నిరంతరం పెరుగుతోందని భట్టి విక్రమార్క తెలిపారు. 2014లో విద్యుత్ డిమాండ్ 15,497 మెగావాట్లు ఉండగా ప్రస్తుతం అది 19,543 మెగావాట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిమాండ్ 20 వేల నుంచి 21 వేల మెగావాట్ల వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

**మొదటి పేజీ తరువాయి**

మేరకు ఎనిమిది మంది సీనియర్ నాయకులతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీని ప్రకటించారు.

ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీకి ఉన్న అనుభవజ్ఞులైన నాయకత్వాన్ని ఎన్నికల నిర్వహణలో వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఎన్నికల ప్రక్రియ మొత్తం సమర్థంగా సాగేందుకు అవసరమైన సూచనలు, మార్గనిర్దేశం చేసే బాధ్యతలను రఘువీరారెడ్డి నిర్వహించనున్నారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలంను నియమించారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డికి స్థానం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యూహాల రూపకల్పన, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాల్లో వీరు కీలక పాత్ర పోషించనున్నారు.

## ...అధ్యయన నివేదిక

**మొదటి పేజీ తరువాయి**

నిపుణులు, మేధావులతో విస్తృతంగా చర్చించి వారి అభిప్రాయాలు, ఆందోళనలు, సూచనలను సేకరించినట్లు వెల్లడించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కమిటీ ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావ్యవస్థలో జరుగుతున్న మార్పులు, జీవో 97 ప్రభావం, విద్యార్థులు మరియు అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలపై కమిటీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యా నాణ్యత, బోధనా విధానాలు, సాంకేతిక విద్య భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు వెల్లడించారు. విద్యార్థుల అభిప్రాయాలతో పాటు అధ్యాపక వర్గాల సూచనలను కూడా నివేదికలో పొందుపరిచినట్లు తెలిపారు. విద్యార్థి సంఘాలు, లెక్చరర్ల సంఘాల ప్రతినిధులు వ్యక్తం చేసిన ఆందోళనలను కమిటీ నమోదు చేసిందని కవిత పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థలో తీసుకుంటున్న నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే అంశంపై విద్యారంగ నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు చెప్పారు. అన్ని వర్గాల అభిప్రాయాలను సమన్వయం చేస్తూ నివేదికను రూపొందించినట్లు వివరించారు. ఈ నివేదికను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హై లెవల్ కమిటీకి సమర్పించనున్నట్లు కవిత వెల్లడించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. నివేదికలో పొందుపరిచిన అంశాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలు, సాంకేతిక విద్యాభివృద్ధి, బోధనా ప్రమాణాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. విద్యా రంగానికి సంబంధించిన నిర్ణయాల్లో విద్యార్థులు, అధ్యాపకుల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని సూచించారు.

## సర్కార్‌ను నిలదీసిన కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి**

రాజకీయాలు చేశారని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక భూదందాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. 22ఏ భూముల వ్యవహారంలో ఒక ముఠా పనిచేస్తోందని, దాని వెనుక అధికార వర్గాల ప్రమేయం ఉందని విమర్శించారు. ప్రభుత్వం తీసుకొస్తున్న పలు పథకాల వెనుక భూ కుంభకోణాలే ఉన్నాయని ఆరోపించారు. హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల పేరుతో వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేసి భూదందాలకు మార్గం సుగమం చేశారని ఆరోపించారు. కొంగరకలాన్ ప్రాంతంలోని భూముల విషయంలో కూడా భారీ అవకతవకలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ధరణి పోర్టల్‌లో భద్రతా వ్యవస్థలు కఠినంగా ఉండేవని, ఇప్పుడు భూభారతి వ్యవస్థలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ, ఈ వ్యవహారాల కారణంగా సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. మరో రెండేళ్లలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడం వెనుక భారీ భూ కుంభకోణం దాగి ఉందని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సీఎం కుటుంబానికి సంబంధించిన భూ అక్రమాల అంశాన్ని కొండా సురేఖ కుమార్తె ప్రస్తావించడంతోనే ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ ప్రభుత్వంలోని అంతర్గత విభేదాలను బయటపెడుతోందని అన్నారు. 22ఏ నిషేధిత భూముల జాబితా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా పెరిగిందని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న భూముల జాబితా ప్రస్తుతం కోటి 16 లక్షల ఎకరాలకు చేరిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూదందాలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

శ్వేత
సంపాదకీయం
శనివారం 12-9-2026

# మొహం చాటేసిన వర్షాలు!

ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులే ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు వర్షాకాలం చివరికి వస్తున్న కొద్దీ దేశంలోని రైతన్నల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించిన తాజా అంచనాల ప్రకారం.. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావం రబీ పంటల సాగుపై తీవ్ర ముప్పుగా పరిణమించేలా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ముగిసే సమయానికి వర్షాలు మొహం చాటేస్తే.. వచ్చే శీతాకాలంలో వేసే రబీ పంటల పరిస్థితి ఏంటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్‌లో వర్షాలు పడకపోయినా విత్తనాలు వేసే సమయం మారకపోవచ్చు కానీ, నేలలో తేమ శాతం దారుణంగా పడిపోతుంది. ప్రస్తుతం దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా, ఇప్పుడు అది 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి నిల్వలు లేకపోతే విత్తనాలు మొలకెత్తడమే కష్టమవుతుంది. భారతీయ వ్యవసాయంలో రబీ కాలం చాలా కీలకమైనది. ముఖ్యంగా నీటి లభ్యత , నేలలోని తేమపై ఆధారపడే గోధుమ, ఆవాలు, శనగ పంటలు ఈసారి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో గోధుమలు, ఆవాల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మొదటి తడికి రిజర్వాయర్ నీళ్లే ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో వేసే శనగ పంట కేవలం భూమిలోని తేమ ఆధారంగానే పెరుగుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే ఈ పంటల దిగుబడి దారుణంగా పడిపోతుంది.

ఎల్ నినో వల్ల ఏర్పడే కరవు పరిస్థితులను అధిగమించడానికి 'ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త ఆశాకిరణంగా కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఈ సానుకూల మార్పు వల్ల భారత్ వైపు వర్షపు మేఘాలు తొలకరిచ్చే అవకాశం ఉంది. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్ నినో తీవ్రతను ఈ ఐఓడీ కొంతవరకు తగ్గించగలిగింది. అయితే, ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమవుతుంది కాబట్టి, ఎండిపోయిన భూగర్భ జలాలను, ఖాళీ అయిన రిజర్వాయర్లను ఎంతవరకు నింపుతుందనేది అనుమానంగానే ఉంది. ఒకవేళ అక్టోబర్, నవంబర్ నెలల్లో భూమిలో తేమ శాతం పెరగకపోతే రబీ పంటల విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరా తగ్గి, నిత్యావసర ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రైతుల ఆదాయాన్నే కాకుండా, సామాన్య ప్రజల జేబులకు కూడా పెద్ద కన్నం వేసేలా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తోంది. ఓవైపు వర్షాధార పంటల సాగును చాలా వరకు తగ్గించినప్పటికీ మరోవైపు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి సైతం చేతికందేలా లేదు. భూగర్భజలాలు దారుణంగా పడిపోయి, బోర్లు వట్టిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూడలేక అన్నదాతలు బావుల్లో పూడిక తీయిస్తూ కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు పడటం లేదు. ఈ వర్షాభావ పరిస్థితులు మరో వారం, పదిరోజుల పాటు కొనసాగితే పంటలపై ఆశలు వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు నమోదయ్యేది. కానీ ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు అంటే సుమారు 92 శాతం మేరకే సాగు చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు నివేదిస్తున్నాయి. ప్రధానంగా 66 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు నమోదవుతుండగా ఈసారి 52.81 లక్షల ఎకరాల్లో(80 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. ఇక పత్తి అంచనా సాగు 47 లక్షల ఎకరాలకు గాను 48 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. 6.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగవుతుండగా 7.86 లక్షల ఎకరాలకు చేరింది. అధికంగా నీటి ఆధారమైన వరి సాగు 20 శాతం వరకు తగ్గింది. కానీ చాలా ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు మాత్రం పంటను కాపాడుకోడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు.

రాష్ట్రంలో ఈ సీజన్?కు సంబంధించి ఇప్పటిదాకా 49 రోజులే వర్షం కురిసింది. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మి.మీ మాత్రమే కురిసింది. మొత్తంగా 20 శాతం లోటు వర్షపాతం ఏర్పడగా 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తక్కిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటులో కొనసాగుతుండటం గమనార్హం. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం దాదాపు 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరి నాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.87 మీటర్లకు పడిపోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, అలాగే వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్లకు లోతులోకి నీటిమట్టాలు పడిపోయాయి. వర్షాలు కురవక, సాగునీరు లేక అన్నదాతలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీటిని బయటకు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. వనపర్తి జిల్లా, పీపనగండ్ల మండలంలోని పుల్గర్ల గ్రామంలో ఉన్న కొత్త చెరువు పరిధిలో 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగయ్యేది. నీటి వసతి ఉన్న కొందరు రైతులు అక్కడక్కడా సుమారు ఐదు ఎకరాల వరకు వరి సాగు చేశారు. మిగిలిన పొలాలు మాత్రం బీళ్లుగా ఉండిపోయాయి. ఆయకట్టు చివరన ఉన్న పంటలకు నీరందించేందుకు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తోడేందుకు రైతులు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇలాంటి పరిస్థితులే మున్ముందు కొనసాగితే సాగు నీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్‌పై లోకేష్‌కు కృతజ్ఞతలు

### గణేష్ ఉత్సవ సమితి నేతల భేటీ
### సింగిల్ విండో అనుమతులపై హర్షం
### మంత్రి నారా లోకేష్‌కు అభినందనలు




అమరావతి, సెప్టెంబర్ 11 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి) రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా కల్పించడంతో పాటు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేసేందుకు చొరవ చూపిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు సమితి ప్రతినిధులు సమావేశమై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణలో ఎదురయ్యే పలు పరిపాలనా సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించిందని సమితి నేతలు పేర్కొన్నారు. ముఖ్యంగా మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను సులభతరం చేయడం వల్ల నిర్వాహకులకు ఎంతో ఉపశమనం కలిగిందన్నారు.

రాష్ట్రంలోని వేలాది గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా ప్రభుత్వం భక్తులకు, ఉత్సవ కమిటీలకు ఆర్థిక భారం తగ్గించిందని సమితి నాయకులు తెలిపారు. ఈ నిర్ణయం ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో జరిగే ఈ వేడుకలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరమాచినేని రంగ ప్రసాద్, బీవీ రమణ కుమార్, ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్, కార్యదర్శి వలివర్తి దుర్గాప్రసాద్, ప్రభుత్వ సంబంధాల కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. మంత్రి నారా లోకేష్‌కు సమితి తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం, నిర్వాహక సంఘాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని సమితి ఆశాభావం వ్యక్తం చేసింది. భక్తుల సౌకర్యాలు, భద్రత, ఉత్సవాల విజయవంత నిర్వహణకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చింది.

# ఎన్ఐఈఎల్ఐటీ క్యాంపస్‌పై యువత గళం

### భూమన అభినయ్ పిలుపుకు విశేష స్పందన

తిరుపతి, సెప్టెంబర్ 11 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి) తిరుపతిలో ప్రతిపాదిత ఎన్ఐఈఎల్ఐటీ (చీ×జూ×ు) శాశ్వత క్యాంపస్ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ భూమన అభినయ్ ఇచ్చిన పిలుపుకు యువత నుంచి విశేష స్పందన లభించింది. రాజకీయాలకు అతీతంగా విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తిరుపతి అభివృద్ధికి సంబంధించి ఈ ప్రాజెక్టు కీలకమని పేర్కొన్నారు.




తిరుపతిలో 15 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఎన్ఐఈఎల్ఐటీ శాశ్వత క్యాంపస్, రూ.87.20 కోట్ల డీపీఆర్ పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని యువత డిమాండ్ చేసింది. ప్రాజెక్టు అమలులో జాప్యం ఎందుకు జరుగుతోందో వెల్లడించాలని కోరారు. తిరుపతి యువత భవిష్యత్తుకు ఈ సంస్థ కీలక అవకాశాలను అందించగలదని అభిప్రాయపడ్డారు. విద్య, పరిశోధన, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పరంగా ఎన్ఐఈఎల్ఐటీ క్యాంపస్ తిరుపతికి ఎంతో ఉపయోగకరమని యువత పేర్కొంది. ఈ తరహా సంస్థలు స్థానిక విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పిస్తాయని వివరించారు. అందువల్ల ప్రాజెక్టును వేగంగా అమలు చేయాలని కోరారు. అమరావతి అభివృద్ధిని వ్యతిరేకించడం తమ ఉద్దేశం కాదని యువత స్పష్టం చేసింది. అమరావతి అభివృద్ధి చెందడంతో పాటు తిరుపతి కూడా సమానంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్ష వ్యక్తం చేసింది. ప్రాంతీయ అభివృద్ధిలో సమతుల్యత ఉండాలని సూచించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు తిరుపతి యువతకు మెరుగైన విద్యా, ఉపాధి అవకాశాలు అందించేందుకు ఎన్ఐఈఎల్ఐటీ క్యాంపస్ అవసరమని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తు తరాల కోసం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు. తిరుపతి అభివృద్ధిలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించగలదని తెలిపారు.



# రైతు సమస్యల పరిష్కారంలో తుమ్మలకు ప్రశంసలు

### బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి) రైతుల సమస్యల పరిష్కారంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చూపిన చొరవను అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రశంసించారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తుమ్మల పనితీరు అభినందనీయమని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి మంత్రి తీసుకున్న చర్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.

తన నియోజకవర్గంలో సుమారు 500 మంది రైతులు ఇంటి ముందు బైఠాయించి ధర్నాకు దిగిన సందర్భాన్ని రాకేష్ రెడ్డి వివరించారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆదివారం రోజున మంత్రి కార్యాలయ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కొద్ది సేపటికే మంత్రి స్వయంగా స్పందించారని చెప్పారు. ఓఎస్డీకి ఫోన్ చేసిన 15 నిమిషాల్లోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనకు ఫోన్ చేశారని రాకేష్ రెడ్డి వెల్లడించారు. రైతుల సమస్యను పూర్తిగా విన్న అనంతరం మూడు గంటల్లో సమస్య పరిష్కారమవుతుందని మంత్రి భరోసా ఇచ్చారని తెలిపారు. చెప్పినట్లుగానే తిరిగి ఫోన్ చేసి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారని పేర్కొన్నారు. తరువాత రోజు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించగా మంత్రి స్వయంగా మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసిందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సమస్యలపై మంత్రి చూపిన చిత్తశుద్ధి, వేగవంతమైన స్పందన తనను ఆకట్టుకుందని అన్నారు. ప్రజాప్రతినిధులందరికీ ఇది ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. నలభై ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన తుమ్మల నాగేశ్వరరావు ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యేల సమస్యలపైనా అదే స్థాయిలో స్పందించడం గొప్ప విషయమని రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యల విషయంలో రాజకీయ భేదాలను పక్కనబెట్టి పనిచేయడం ప్రజాస్వామ్యానికి మంచిదని అన్నారు.



అమరావతి సచివాలయంలో శుక్రవారం గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజు శాంతిభద్రతలపై జరిగిన సమీక్షకు హాజరైన ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, డ్రగ్స్ నియంత్రణ, మహిళల భద్రత, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల దర్యాప్తు, ఫోరెన్సిక్ సేవలు, పోలీసుల స్పందన వేగం, కన్విక్షన్ రేట్ పెంపు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ గడువు ముగిసింది

**అక్టోబరు 5 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం**

**అక్టోబరు 9న తుది ఓటర్ల జాబితా ప్రచురణ**

**... జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీశ**

విజయవాడ: సెప్టెంబర్ 11,2026.జిల్లాలో భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ాజూవఎఱుశ్రీ ×త్వఅంఱజవ =వజఱంఱశీఅ)లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నిర్ణయించిన గడువు గురువారం అర్ధరాత్రితో (10.09.2026) ముగిసిందని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీశ తెలిపారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించడంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, బదిలీ అయిన వారు, ఇతర కారణాల వల్ల అనర్హులైన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఫారం-6 కింద మొత్తం 40,802 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. వీటిలో ఇప్పటికే 27,224 దరఖాస్తులను పరిష్కరించినట్లు వెల్లడించారు. మిగిలిన దరఖాస్తులను కూడా ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తుదారులకు ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరణించిన, బదిలీ అయిన, శాశ్వతంగా వలస వెళ్లిన లేదా ఇతర కారణాల వల్ల అనర్హులైన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఫారం-7 కింద మొత్తం 21,023 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం మాత్రమే తగిన నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓటర్ల నివాస మార్పులు, ఓటరు గుర్తింపు కార్డు రీప్లేస్‌మెంట్, ఓటరు జాబితాలోని వివరాల సవరణలు, ఇతర మార్పుల నమోదు కోసం ఫారం-8 కింద 44,638 దరఖాస్తులు అందినట్లు డా.జి.లక్ష్మీశ తెలిపారు.

అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా ఉండేలా, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉండకుండా, ఓటర్ల జాబితా నాణ్యతను మెరుగుపరిచే దిశగా ఈ దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు అందిన దరఖాస్తులతో కలిపి ప్రస్తుతం ఫారం-6కు సంబంధించిన 10,330 దరఖాస్తులు, ఫారం-7కు సంబంధించిన 982 దరఖాస్తులు, ఫారం-8కు



సంబంధించిన 7,447 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ దరఖాస్తులను నిర్ణీత నిబంధనల ప్రకారం పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆయన వివరించారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై స్వీకరించిన అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించే ప్రక్రియ అక్టోబరు 5, 2026 వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన ఏ ఒక్కరి పేరు కూడా అన్యాయంగా తొలగించబడకుండా, అదే సమయంలో అనర్హుల పేర్లు జాబితాలో కొనసాగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ పత్రాలలో లోపాలు ఉన్నట్లు గుర్తించిన 1,94,681 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో ఇప్పటికే 1,83,300 మంది ఓటర్లకు సంబంధించిన విచారణ ప్రక్రియ పూర్తయిందని ఆయన వెల్లడించారు. సంబంధిత ఓటర్లు సమర్పించిన పత్రాలు, వివరాలను అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్లలో, అవసరమైన సరైన పత్రాలు సమర్పించకపోవడం మరియు నిబంధనలకు అనుగుణంగా అర్హతను నిరూపించుకోలేకపోవడం వంటి కారణాలతో 6,280 మందిని అనర్హులుగా తేల్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అయితే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి కేసును నిబంధనల మేరకు పరిశీలించిన తరువాత మాత్రమే తుది నిర్ణయం తీసుకుంటున్నామని, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిశీలన, ఎన్యుమరేషన్ పత్రాల పరిశీలన తదితర ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం 2026 అక్టోబరు 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రజలందరూ సహకరించాలని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.



# శ్రీకాకుళం ఉమెన్స్ కళాశాల హాస్టళ్లను పరిశీలించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

సెప్టెంబర్ 11: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం శ్రీకాకుళం ఉమెన్స్ కళాశాల హాస్టల్ భవనాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

బీసీ హాస్టల్-1, 2, 3తో పాటు ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను సందర్శించిన కేంద్ర మంత్రి.. విద్యార్థినులకు అందుతున్న వసతులు, హాస్టళ్లలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. హాస్టల్ భవనాల్లో కలియతిరుగుతూ విద్యార్థినులతో, వార్డెన్లు, సిబ్బందితో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందుతున్న భోజనం, తాగునీరు, గదులు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతులు కల్పించడంతో పాటు, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి సూచించారు. విద్యార్థినుల అవసరాలు, సౌకర్యాల విషయంలో సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. త్వరలోనే మళ్ళీ హాస్టల్ భవనాలను పరిశీలిస్తానని.. పురోగతి కనిపించాలని సిబ్బందిని అదేశించారు. విద్యార్థినిలు చదువుల్లో మరింత రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, వంశధార ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర, హాస్టల్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం: మంత్రి కందుల దుర్గేష్

విశాఖపట్నం: విశాఖపట్నంలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ నిర్వహిస్తోన్న "ఎంఎస్ఎంఈ బిజినెస్ ఎక్స్‌పో-2026" ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి సెప్టెంబర్ 11 నుండి 13 వరకు జరిగే ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ పరిశ్రమల ప్రొడక్ట్ స్టాళ్లను మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించారు. ఎంఎస్ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, స్టార్టప్ తదితర ఒక్కో స్టాల్ నిర్వాహకులతో ప్రత్యేకంగా మాట్లాడి, ఉత్పత్తులు, వ్యాపార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌పోలో మొత్తం 187 స్టాళ్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రతినిధులను ప్రశంసించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "రాష్ట్రంలో మీవీజులు, స్టార్టప్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధిని పెంచడం, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా "ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 (2024-29)" విధానాన్ని అమలు చేస్తోంది.ఈ పాలసీ ద్వారా 2030 నాటికి "ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త" అనే వినూత్నమైన దృక్పథాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం ద్వారా ఐదేళ్లలో రూ. 50,000ల కోట్ల పెట్టుబడులను రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. 1.75 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 మైక్రో పార్కులను ఏర్పాటు చేస్తోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సరైన గైడెన్స్, కన్సల్టెన్సీ సేవలు అందిస్తూ, వారి వ్యాపారాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీవీజులకు ప్రత్యేక వింగ్స్ ద్వారా పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న వైజాగ్ నగరంలో ఇలాంటి బిజినెస్ ఎక్స్‌పోలు ఏర్పాటు చేయడం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మంచి మార్గదర్శకత్వం లభిస్తుంది. అంతేగాక ఒక ప్రైవేట్ సంస్థగా ఉన్న ఏపీ చాంబర్ షాప్ కామర్స్ ప్రభుత్వ ఆర్థికపర, విధానపరమైన ఆలోచనను తద్వారా సహకారం అందించేందుకు ఒక కామన్ ప్లాట్ఫారం ఈ బిజినెస్ ఎక్స్ పో ద్వారా తీసుకువచ్చింది. ఈ ఎక్స్ పోలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను విస్తరిస్తూ, తమ ఉత్పత్తులకు తమ కంపెనీని ప్రమోట్ చేసుకొని కొత్త కొత్త ఆలోచనలతో మరింత ముందుకు వెళ్లి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి." అని పేర్కొన్నారు.

# ఇంటింటికి కులాయి నిమిత్తం 479.63 కోట్లు

**ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి లకు కృతజ్ఞతలు**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



విజయనగరం, సెప్టెంబర్ 11, ఇంటింటికి కులాయి నిమిత్తం జల జీవన్ మిషన్ నుండి హర్ ఘర్ జల్ పథకంలో 479.63 కోట్లు మంజూరు చేయటం పట్ల రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా 1329 గృహాలకు గాను 711 పనులకు గాను నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ నిధులతో హర్ ఘర్ జల్ పథకాన్ని 2029 నాటికి నూరు శాతం వేగవంతంగా పనులు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మాత్యులు పవన్ కళ్యాణ్ లకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# శిథిలావస్థలో ఉన్న విద్యాధరపురం లేబర్ కాలనీ భవనాలను వెంటనే ఖాళీ చేయాలి

విజయవాడ: సెప్టెంబర్ 11, 2026.ఒకార్మిక శాఖ కమిషనర్, ఆంధ్రప్రదేశ్, విజయవాడ వారి ఆదేశాల మేరకు విజయవాడ నగరంలోని విద్యాధరపురం లేబర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన భవనాలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించారు. విద్యాధరపురం లేబర్ కాలనీలో మొత్తం 6 బ్లాకుల్లో 48 ప్లాట్లు ఉండగా, వాటిలో సుమారు 40 ప్లాట్లలో కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రస్తుతం ఆయా భవనాలు శిథిలావస్థకు చేరినందున వాటిలో నివసిస్తున్న కుటుంబాలకు ప్రాణనష్టం, ఆస్తినష్టం, ఆర్థిక నష్టం సంభవించే ప్రమాదం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో నివాసితులు భవనాలను వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు.

ప్రమాదకర స్థితిలో ఉన్న భవనాలను ఖాళీ చేయాల్సిందిగా సంబంధిత నివాసితులకు ఇప్పటికే 25.11.2025న నోటీసులు జారీ చేసినప్పటికీ, కొంతమంది ఇప్పటికీ ఆయా భవనాల్లో నివసిస్తున్న నేపథ్యంలో వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని మరోసారి భవనాలను ఖాళీ



చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, రోడ్లు మరియు భవనాల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని భవనాల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, నివాసితుల భద్రతకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు గుంటుపల్లి ధనలక్ష్మి, ఉప కార్మిక కమిషనర్, విజయవాడ తెలిపారు.



## అసెంబ్లీ ఘటనలపై సమగ్ర విచారణ జరపాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 11,:**

తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ప్రతిపక్ష సభ్యులను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకోవడం, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన విమర్శించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువల గురించి తరచూ మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై స్పందించాలని వద్దిరాజు రవిచంద్ర కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచివి కావని ఆయన అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తున్నారని, ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలను అణిచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన ఘటనలు ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌లకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి వాస్తవాలను వెలికితీయాలని సంబంధిత కమిషన్లను కోరారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనలపై స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాలకు కూడా సమాన హక్కులు ఉండాలని, వాటిని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు, శాసనసభ గౌరవాన్ని నిలబెట్టేందుకు ఘటనలకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధ హక్కులు పరిరక్షించబడేలా ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు.



## ట్రాన్స్‌జెండర్లకు కార్పొరేషన్లలో ప్రాతినిధ్యం

**హైదరాబాద్, సెప్టెంబర్ 11::**

ట్రాన్స్‌జెండర్ల సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు తెలంగాణ శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలన, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు--2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019లో అమల్లోకి వచ్చిన తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తోంది. సవరణల ప్రకారం హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధి వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. దీంతో స్థానిక సంస్థల పాలనలో ట్రాన్స్‌జెండర్ వర్గానికి ప్రత్యక్ష ప్రాతినిధ్యం లభించనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్షకు గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు ప్రజా జీవితంలో వారి పాత్రను మరింత బలోపేతం చేయడమే ఈ నిర్ణయ లక్ష్యమని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధనలో భాగంగా ప్రభుత్వం ఈ సంస్కరణను తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ చట్ట సవరణను రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్ సమాజానికి గౌరవప్రదమైన స్థానం కల్పించడంతో పాటు పాలనలో భాగస్వామ్యం పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా వివిధ రాజకీయ పార్టీల సభ్యులు మద్దతు ప్రకటించారు. అనంతరం శాసనసభ ఈ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నిర్ణయం ట్రాన్స్‌జెండర్ల సామాజిక, రాజకీయ సాధికారతకు దోహదపడటమే కాకుండా స్థానిక పాలనలో సమగ్ర భాగస్వామ్యానికి కొత్త దారులు తెరుస్తుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

# సీఐఎస్ఎఫ్ సిబ్బందికి పదోన్నతులు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:**

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) యూనిట్‌లో ప్రమోషన్ అండ్ పిప్పింగ్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 48 మంది కానిస్టేబుల్/జీడీ సిబ్బందికి హెడ్ కానిస్టేబుల్/జీడీ హోదాలకు పదోన్నతులు కల్పించారు. వారి అంకితభావం, కృషి, విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ పదోన్నతులు లభించాయి. పదోన్నతి పొందిన సిబ్బంది కొత్త హోదాల్లో తమ బాధ్యతలను స్వీకరించారు. విధి నిర్వహణలో చూపిన క్రమశిక్షణ, నిబద్ధత, సేవా భావం కారణంగానే ఈ గుర్తింపు లభించిందని అధికారులు పేర్కొన్నారు. పదోన్నతులు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని, బాధ్యతాయుతమైన సేవా దృక్పథాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి డీఐజీ/డీఎంఆర్సీ సంతోష్ చాల్కే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు సీనియర్ కమాండెంట్లు గుర్జీత్ సింగ్, పాలియాంకాప్ తదితర అధికారులు పాల్గొన్నారు. పదోన్నతి పొందిన సిబ్బందికి కొత్త ర్యాంక్ గుర్తులను ధరింపజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పదోన్నతి అనేది కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాదని, అదనపు బాధ్యతలకు ప్రతీక అని పేర్కొన్నారు. కొత్త బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. ప్రజల భద్రత, దేశ సేవలో మరింత నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు. సీఐఎస్ఎఫ్ దేశంలోని కీలక సంస్థలు, మౌలిక సదుపాయాల భద్రతలో కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు తెలిపారు. డీఎంఆర్సీ వంటి రద్దీ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయడంలో సిబ్బంది సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. పదోన్నతులు పొందిన సిబ్బంది భవిష్యత్తులోనూ ఉత్తమ సేవలు అందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమం సందర్భంగా పదోన్నతి పొందిన సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తామని తెలిపారు. కొత్త హోదా తమకు గౌరవంతో పాటు మరింత బాధ్యతను తీసుకువచ్చిందని పేర్కొన్నారు.




# ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

**జనగామ, సెప్టెంబర్ 11,:**

జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని దేవరుప్పుల గ్రామ పంచాయతీలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని ప్రత్యక్షంగా తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను కలిసిన సందీప్ కుమార్ ఝా, ఇప్పటివరకు ఎన్ని విడతలుగా బిల్లులు అందాయనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన లబ్ధిదారులు మూడు విడతలుగా బిల్లులు అందాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి అయిన ఖర్చు, పనుల ప్రస్తుత స్థితిగతులపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఇంకా రెండు లేదా మూడు రోజుల్లో ఇంటికి తలుపులు అమర్చి, సున్నం వేయించే పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తయితే తదుపరి బిల్లుల మంజూరు ప్రక్రియ త్వరితగతిన జరుగుతుందని వివరించారు. కలెక్టర్ సూచనలకు స్పందించిన లబ్ధిదారులు పనులను వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్దేశిత



గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా బండి పల్లి పద్మ, తోటకూర శారద నిర్మిస్తున్న ఇళ్లను సందీప్ కుమార్ ఝా ప్రత్యేకంగా పరిశీలించారు. వివిధ దశల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్, నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల వ్యాప్తిని నివారించి వ్యాధులను అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ వైఫల్యాలపై రాహుల్ ఆందోళన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11,::**

భారత విద్యా వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది మంది యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ, ప్రస్తుత విద్యా వ్యవస్థ వారిని నిరాశపరుస్తోందని విమర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని వాటికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పేపర్ లీకులు, అధిక ఫీజులు, శిథిలావస్థకు చేరుతున్న మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. భవిష్యత్ తరాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన వ్యవస్థే వారిని వెనక్కి నెడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆశయాలు, కలలు నెరవేరేలా విద్యా వ్యవస్థ పనిచేయాల్సి ఉండగా, అనేక లోపాల కారణంగా యువత ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. విద్యా వ్యవస్థలోని సమస్యలను సరిదిద్దాలంటే ముందుగా వాటిని ప్రత్యక్షంగా అనుభవిస్తున్న వారి స్వరాన్ని వినాలని రాహుల్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ అనుభవాలను తనతో పంచుకోవాలని కోరారు. ఈ మేరకు విద్యా వ్యవస్థలోని లోపాలకు సంబంధించిన వివరాలను అందించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ లింక్‌ను కూడా ఆయన పంచుకున్నారు. దేశవ్యాప్తంగా యువత సమస్యలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాహుల్ తెలిపారు. ఇప్పటికే కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్, పుణే నగరాల్లో సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా విద్యా రంగ సంస్కరణలకు మార్గం సుగమమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నెల 19న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో మరో సమావేశం నిర్వహించనున్నట్లు రాహుల్ ప్రకటించారు. దేశంలోని ప్రతి విద్యార్థి స్వరం వినిపించాల్సిన అవసరం ఉందని, కొద్దిమంది అభిప్రాయాలతో మాత్రమే సమస్యలకు పరిష్కారం దొరకదని పేర్కొన్నారు. యువత ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకుని వాటికి తగిన పరిష్కారాలు కనుగొనడం అత్యవసరమని అన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ యువత ఆశలను దెబ్బతీస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే సమస్యలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని, అందరూ కలిసి విద్యా రంగాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దడం దేశ భవిష్యత్తుకు కీలకమని ఆయన పేర్కొన్నారు.






## పేదల గృహ కలను సాకారం చేసిన కాంగ్రెస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పేదల సొంతింటి కలను సాకారం చేసే గొప్ప కార్యక్రమంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం నిలిచిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ గృహ నిర్మాణ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించడంలో ఇందిరమ్మ ఇళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం చేపట్టడం శుభపరిణామమని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సొంత ఇల్లు లేని కుటుంబాలకు భద్రత, స్థిరత్వం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పేదల అవసరాలను గుర్తించి గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టడం ప్రత్యేక ముందడుగుగా ఆయన అభివర్ణించారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలతో కూడిన గృహ సముదాయాల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ తరహా ప్రాజెక్టులు భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.720 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాల్సిన అవసరం ఉందని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. నిధుల విడుదలతో గృహ నిర్మాణ కార్యక్రమాలు మరింత వేగంగా ముందుకు సాగుతాయని తెలిపారు. పేదల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో కేంద్రం సహకారం అందించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ రంగం నిర్లక్ష్యానికి గురైందని ఆయన విమర్శించారు. ఇళ్ల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని ఆరోపించారు. పేదల సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గృహ నిర్మాణాన్ని ప్రాధాన్య అంశంగా తీసుకుని ముందుకు సాగుతోందని చెప్పారు. పేదవాడి సొంతింటి కలను పూర్తిస్థాయిలో నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గృహ నిర్మాణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందించే దిశగా చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

**సెప్టెంబర్ 11:**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి కొత్త శిఖరాలను చేరుకుంటోందని బీజేపీ నాయకుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.10,021 కోట్ల వ్యయంతో ఐదు కీలక రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపడం శుభపరిణామమని అన్నారు. ఈ ప్రాజెక్టులు దేశ ఆర్థికాభివృద్ధికి, రవాణా రంగ పురోగతికి దోహదపడతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల ద్వారా 540 కిలోమీటర్ల మేర రైల్వే మార్గాల సామర్థ్యం పెరుగుతుందని సోము వీర్రాజు పేర్కొన్నారు. అరక్కోణం--రేణిగుంట, వైట్‌ఫీల్డ్--బంగారుపేట, హోసూరు--ఓమలూరు, సేలం--కరూరు--దిండిగల్, సికింద్రాబాద్--కాజీపేట మార్గాల్లో మల్టీట్రాకింగ్, డబ్లింగ్ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ పనులతో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దక్షిణ భారత రాష్ట్రాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మొత్తం 17 జిల్లాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుండగా, 2,121 గ్రామాలకు





మెరుగైన రైలు కనెక్టివిటీ లభించనుందని తెలిపారు. ప్రాంతీయ అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని అన్నారు. దాదాపు 52 లక్షల మందికి ఉన్నత స్థాయి రైలు సేవలు అందుబాటులోకి రావడంతో పాటు సరకు రవాణా సామర్థ్యం కూడా గణనీయంగా పెరుగుతుందని సోము వీర్రాజు పేర్కొన్నారు.



## మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణ

గద్వాల, సెప్టెంబర్ 11:
ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు. గణేశ్ ఉత్సవాల సందర్భంగా పర్యావరణహిత వేడుకల ప్రాధాన్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి పరిరక్షణతో పాటు సంప్రదాయాలను కాపాడే దిశగా మట్టి వినాయకుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాల వల్ల చెరువులు, కుంటలు, ఇతర జలవనరులు కాలుష్యానికి గురవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. అందువల్ల ప్రజలందరూ మట్టి వినాయకులను ఎంచుకుని పర్యావరణానికి మేలు చేయాలని పిలుపునిచ్చారు. గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా, పర్యావరణహితంగా నిర్వహించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు మట్టి గణనాథులను పూజించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని సమాజంలో విస్తృతంగా తీసుకెళ్లడంలో అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మట్టి వినాయకుల ప్రాధాన్యంపై ముద్రించిన గోడపత్రికలను కలెక్టర్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలను ప్రదర్శించి వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మంజుల, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. పలువురు అధికారులకు, కలెక్టరేట్ సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణహిత గణేశ్ ఉత్సవాల నిర్వహణకు అందరూ సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం



కొత్తగూడెం, సెప్టెంబర్ 11:
జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం ఇల్లందు క్రాస్‌రోడ్‌లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్ లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలమల శ్రీనివాసరావు విగ్రహానికి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సేవలు, త్యాగాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అటవీ సంరక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తుంచుకోవడం మాత్రమే కాకుండా యువతకు, భావితరాలకు తెలియజేయడం కూడా సమాజ బాధ్యత అని చెప్పారు. అటవీ నేరాల నియంత్రణలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక పరికరాలు, మెరుగైన లైటింగ్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ సౌకర్యాలను ఉపయోగించడం ద్వారా అటవీ సంరక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చన్నారు. అటవీ సిబ్బందికి అవసరమైన శిక్షణ, భద్రతా పరికరాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తారమైన అటవీ ప్రాంతం ఉందని, కోయలు, కొండరెడ్లు తదితర గిరిజన సమాజాల జీవన విధానం అడవులతో ముడిపడి ఉందని కలెక్టర్ తెలిపారు. అటవీ సంపదను పరిరక్షించడంతో పాటు గిరిజనుల హక్కులను కాపాడటం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఈ లక్ష్య సాధనకు అటవీ శాఖ, గిరిజన సమాజాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, అటవీ హక్కుల అంశాలపై అధికారులు, అటవీ సిబ్బంది, గిరిజన సమాజాల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా అటవీ సంపద పరిరక్షణపై మరింత చైతన్యం కల్పించాలని అన్నారు. ప్రకృతి వనరులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అటవీ సంపదను రక్షించేందుకు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అటవీ శాఖ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అటవీ సంరక్షణకు కట్టుబడి పనిచేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ సభ ముగిసింది.



## ధర్మపురిలో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

జగిత్యాల, సెప్టెంబర్ 11:
ధర్మపురి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించిన నోటీసుల జారీ, విచారణలు, ఆధారాల సేకరణ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బందితో మాట్లాడి ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా అందజేయాలని సూచించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పని చేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ప్రజలకు సరైన సమాచారం అందించి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, ఆధారాల ధృవీకరణ, నమోదు ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అర్హులైన ఓటర్లు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ధర్మపురిలో గోదావరి నది తీరంలో జరుగుతున్న ఘాట్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పుష్కరాల నాటికి అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ఘాట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనుల అమలులో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, బీఎల్‌వోలు తదితర అధికారులు పాల్గొన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియతో పాటు గోదావరి పుష్కరాల ఏర్పాట్లను విజయవంతంగా పూర్తి చేయడానికి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.



## గీకురు రవీందర్‌కు ఈటెల నివాళులు

హుస్నాబాద్, సెప్టెంబర్ 11:
హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి మండలంలో ఇటీవల మృతి చెందిన మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్ నివాసాన్ని ఎంపీ ఈటెల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రవీందర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించినట్లు ఈటెల రాజేందర్ తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఈ క్లిష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రవీందర్ మరణం ప్రజా జీవితానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్‌గా, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవీందర్ అందించిన సేవలను నాయకులు గుర్తు చేసుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవను కొనియాడారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగిన నాయకుడిగా ఆయన పేరు సంపాదించుకున్నారని అన్నారు. రవీందర్ సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తిగా ఆయనను అభివర్ణించారు. సమాజ అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి, జమ్మికుంట మాజీ జడ్పీటీసీ శ్రీరాం శ్యామ్, కాటారం సింగిల్ విండో చైర్మన్ చల్లా నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు కూడా హాజరై నివాళులర్పించారు.

## గణేష్ ఉత్సవాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్ శ్వేత

వరంగల్, సెప్టెంబర్ 11:
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ గురువారం కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యంతో పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పరారీలో ఉన్న నిందితులను గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో వేగం, నాణ్యత రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. భౌతిక, సాంకేతిక, ఫోరెన్సిక్ ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి కేసుల విచారణను పటిష్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. న్యాయ స్థానాల్లో కేసుల విజయవంతమైన విచారణకు అవసరమైన సాక్ష్యాధారాలను సమగ్రంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, ఆస్తి నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇతర తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల భద్రతకు భంగం కలిగించే అంశాలపై ముందస్తు చర్యలు తీసుకుని నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రుల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కమిషనర్ ఆదేశించారు.





## పర్యావరణహిత వినాయకులకు ప్రోత్సాహం

మల్కాజిగిరి, సెప్టెంబర్ 11:
గణేశ్ చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలని ప్రజలను ప్రోత్సహిస్తూ బోడుప్పల్ సర్కిల్-10లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ శైలజ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. గణేశ్ ఉత్సవాల సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా సహజ మట్టితో తయారైన విగ్రహాలను ఉపయోగించాలని అధికారులు పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాల వినియోగం వల్ల చెరువులు, కుంటలు, ఇతర జలవనరులు కాలుష్యానికి గురికాకుండా ఉంటాయని తెలిపారు. పర్యావరణహిత పండుగల ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శైలజ మాట్లాడుతూ భక్తితో పాటు బాధ్యతతో కూడా గణేశ్ ఉత్సవాలను నిర్వహించాలని ప్రజలకు సూచించారు. చిన్న నిర్ణయాలే పెద్ద మార్పులకు దారి తీస్తాయని, మట్టి విగ్రహాల ఎంపిక అలాంటి సానుకూల చర్యల్లో ఒకటని అన్నారు. పర్యావరణాన్ని కాపాడే దిశగా ప్రతి కుటుంబం ముందుకు రావాలని కోరారు. మల్కాజిగిరి పరిధిలోని చెరువులు, నీటి వనరుల సంరక్షణకు ప్రజల సహకారం అత్యంత అవసరమని అధికారులు తెలిపారు. రసాయన రంగులు, పీవోపీ విగ్రహాల వల్ల నీటి కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల్లో సామాజిక బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. గణేశ్ ఉత్సవాల సందర్భంగా హరిత సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణహిత వేడుకలు, బాధ్యతాయుతమైన పౌరసత్వం, హరిత మల్కాజిగిరి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. మట్టి వినాయక విగ్రహాల వినియోగం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో ప్రజలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గణేశ్ చవితిని భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ స్పృహతో జరుపుకోవాలని సూచించారు.



## ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 11:**

ఈ నెల 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేడుకలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాలకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విభాగానికి కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి, కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడా లని ఆదేశించారు. వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్ర మాలు, అతిథుల ఏర్పాట్లు, వేదిక నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం, భద్రతా చర్యలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. కార్యక్రమాల నిర్వహణలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాపాలన దినోత్సవం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల ప్రతిబింబంగా నిలవాలని ఆయన అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, డీఆర్వో ప్రవంతి, జడ్పీ సీఈవో రవి, పర్యవేక్షకురాలు శైలజతో పాటు వివిధ శాఖల జిల్లా అధికా రులు పాల్గొన్నారు. తమ శాఖలకు సంబంధించిన ఏర్పాట్ల పురోగ తిని కలెక్టర్‌కు వివరించారు. వేడుకలను విజయవంతం చేయడా నికి అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ రాజ ర్షిషా పిలుపునిచ్చారు. నిర్ణీత గడువులోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.



## బ్రిక్స్ వేదికగా భారత ఆవిష్కరణల ప్రదర్శన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:**

18వ బ్రిక్స్ సదస్సు–2026లో భాగంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో "బ్రిక్స్ భారత్ ఇన్నోవేట్స్ ఎక్స్‌పోజిషన్–2026" ఘనంగా ప్రారంభమైంది. సాంకేతికత, ఆవిష్కరణల రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు, పరిశ్రమల నిపుణులు, ఆవిష్కర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ ప్రదర్శనలో 37 మంది భారతీయ డీప్‌టెక్ ఆవిష్కర్తలు తమ వినూత్న సాంకేతిక పరిజ్ఞానాలను ప్రదర్శిస్తున్నారు. కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, అధునాతన తయారీ, స్మార్ట్ సొల్యూషన్స్, భవిష్యత్ సాంకేతిక రంగాలకు సంబంధించిన పలు ఆవిష్కరణలు ఇందులో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రపంచ స్థాయి సాంకేతిక పరిష్కారాలను అందించే సామర్థ్యం భారత స్టార్టప్‌లు, ఆవిష్కర్తల్లో ఉందని ఈ ఎక్స్‌పో ద్వారా స్పష్టమవుతోంది.

# డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు



**గద్వాల, సెప్టెంబర్ 11:**

జిల్లాలో డ్రగ్స్ మహమ్మారిని సమూలంగా నిర్మూలించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిం చిన నషాముక్త భారత్ అభియాన్ సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యాసంస్థలు, ముఖ్యంగా కళాశాలల్లో డ్రగ్స్ వినియోగం నివారణపై పెద్ద ఎత్తున అవగా హన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుం డా కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో చైతన్యం పెంచడం ద్వారా డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టవచ్చని పేర్కొన్నారు. అబ్కారీ, పోలీస్ శాఖలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై నిఘా ఉంచాలని, అసాంఘిక కార్యక లాపాలను అడ్డుకోవాలని కలెక్టర్ సూచిం చారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థల పరిసరాల్లోని దుకాణదారులు, గృహ యజమానులు అనుమానాస్పద కార్యక లాపాలపై సమాచారం అందించాలని కోరా రు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు, గుట్కా విక్రయాలను కూడా నిరోధించాలని డీఈఓకు సూచించారు. జిల్లాలో కొంతమంది యువత స్టెరాయిడ్స్ వినియోగిస్తున్నట్లు సమాచారం అందిందని, దీనివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ తెలిపారు. జిమ్ ట్రైనర్లు, ఆర్‌ఎంపీలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి స్టెరాయిడ్స్ దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించాలని ఆదేశిం చారు. యువత ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా గంజాయి మొక్కల సాగు జరగకుండా వ్యవసాయ, పోలీస్ శాఖలు సంయుక్తంగా నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. డ్రగ్స్ కార్యకలాపాలు, రవాణా గురించి సమాచారం అందించే పౌరులకు రూ.10 వేల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ సరఫరాను అరికట్టేందుకు ఇప్పటికే విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తున్నామని తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉండటంతో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేసినట్లు చెప్పారు. డ్రగ్స్ కేసులు పెరుగుతున్న నేప థ్యంలో ఈగల్ విభాగం, ఇతర శాఖల సమ న్వయంతో కఠిన చర్యలు కొనసా గిస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగ రావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దుర్శేడ్ 220 కేవీ సబ్‌స్టేషన్ పరిశీలన



**కరీంనగర్, సెప్టెంబర్ 11,:**

టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి శుక్రవారం కరీంనగర్ జిల్లాలోని దుర్శేడ్ 220 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్యుత్ లోడ్ పరిస్థితులు, సరఫరా వ్యవస్థ సామర్థ్యం, గ్రిడ్ నిర్వహణ అంశా లపై అధికా రులతో సమీక్ష నిర్వహిం చారు. సబ్‌స్టేషన్‌లోని పరికరాల పనితీ రు, విద్యుత్ పంపిణీ విధానం, భద్రతా ప్రమాణాలను పరిశీ లించిన కర్నాటి వరుణ్ రెడ్డి, వినియోగ దారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకో వాలని అధికా రులను ఆదేశించారు. ఈ సందర్భంగా కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యం నాణ్యమైన, నిరంతరా య విద్యుత్ సరఫరా అందించడమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో గ్రిడ్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంద న్నారు. విద్యుత్ సరఫరాలో వోల్టేజ్ స్థాయి లను సక్రమంగా నిర్వహి స్తూ వ్యవస్థ విశ్వసనీయతను కాపాడా లని ఆయన అధికారులకు సూచించా రు. సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి వినియోగదా రులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయా లని అధికారులకు దిశానిర్దేశం చేశా రు. విద్యుత్ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సేవల నా ణ్యతను పెంచాలని పేర్కొన్నా రు. సబ్‌స్టేషన్ తనిఖీ సందర్భంగా అధికారు లు సీఎండీకి వివిధ సాంకేతిక అంశా లపై వివరాలు అందించారు. రాష్ట్ర ప్రజలకు నమ్మక మైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిచేందుకు సంస్థ కట్టుబడి ఉందని కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు.



## డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం

**హన్మకొండ, సెప్టెంబర్ 11,:**

మత్తు పదార్థాలు, గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేం దుకు పోలీస్ శాఖ--ప్రజల భాగస్వామ్యంతో 'సంఘమిత్ర' కార్యక్రమాన్ని శుక్రవారం హన్మకొం డలోని కాళోజి కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభిం చారు. మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతిని ధులు, మెప్మా సభ్యులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్న ఈ కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనలో మహిళా సంఘాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి మహిళ ఒక 'సంఘమిత్ర'గా మారి తన పరిధి లోని కుటుంబాలకు డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని చేరవేయా లని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగం, విక్రయం లేదా సరఫరాకు సంబంధిం చిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజే యాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, విలువైన సమాచారం ఇచ్చిన వారికి తగిన ప్రోత్సా హకాలు అందజేస్తామని ఎన్. శ్వేత తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని దూరం చేయకుండా కౌన్సెలింగ్, వైద్య సహాయం, కుటుంబ మద్దతుతో తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చని వివరించారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉన్న విస్తృత నెట్‌వర్క్‌ను డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి వినియోగించాల ని సూచించారు. మహిళల ద్వారా చేరే అవగాహన సందేశం వేలాది కుటుంబాలపై ప్రభా వం చూపగలదని పేర్కొన్నారు. యువత ప్రవర్తనలో వచ్చే మార్పులను తల్లిదండ్రులు ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించా రు. సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో మహిళల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. వ్యసనానికి గురైన వ్యక్తుల్లో కనిపించే లక్షణాలు, వారికి ఎలా సహాయం చేయాలి, కుటుం బ సభ్యులు ఎలా స్పందించాలి వంటి అంశా లపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. గ్రామాల్లో అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచా రం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డ్రగ్స్ వ్యసనం నుంచి బయటపడి సాధారణ జీవితంలోకి వచ్చిన ఒక వ్యక్తి తన అనుభవాలను పంచుకు న్నారు. డ్రగ్స్ కారణంగా తన కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందులను వివరిస్తూ యువత ఎప్పటికీ మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు.

## స్వదేశీ హోలోగ్రాఫిక్ సైట్‌కు విశేష ఆదరణ

**కోయంబత్తూరు, సెప్టెంబర్ 11,:**

భారత సైనికులు ఉపయోగించే రైఫిళ్ల కోసం పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన 'హోలోగ్రాఫిక్ వెపన్ సైట్' దేశ రక్షణ రంగంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) సాంకేతిక సహకారంతో కోయంబత్తూరుకు చెందిన 'ఇగ్నెట్టా హోలోగ్రాఫిక్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ ఈ అధునాతన పరికరాన్ని అభివృద్ధి చేసి భారత సైన్యానికి సరఫరా చేసింది. దీంతో అత్యాధునిక సైనిక పరికరాల తయారీలో భారత సామర్థ్యం మరోసారి నిరూపితమైంది. హోలోగ్రాఫిక్ వెపన్ సైట్ అనేది సైనికులు తమ లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో గురిపెట్టేందుకు ఉపయోగించే ఆధునిక ఆప్టికల్ పరికరం. సాధారణంగా ఇలాంటి సాంకేతికతను అమెరికా వంటి కొద్ది దేశాలే అభివృద్ధి చేస్తుండగా, ఇప్పుడు భారత్ కూడా ఆ జాబితాలో చోటు సంపాదించింది. ఈ పరికరాన్ని తయారు చేస్తున్న దేశాల్లో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచినట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఈ పరికరం ప్రత్యేకత ఏమిటంటే, సైనికులు రెండు కళ్లను తెరిచి ఉంచి కూడా లక్ష్యాన్ని స్పష్టంగా గుర్తించి గురిపెట్టగలుగుతారు. సుమారు 100 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని కూడా ఒక్క అంగుళం పరిధిలో అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం దీనికి ఉంది. లక్ష్యం కదులుతున్న సమయంలో కూడా అది స్థిరంగా కనిపించేలా 'పారలాక్స్' సాంకేతికతను ఇందులో వినియోగించారు. ఇప్పటివరకు భారత్ ఇలాంటి హోలోగ్రాఫిక్ సైట్లను విదేశాల నుంచి, ముఖ్యంగా అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటూ వచ్చింది. అయితే ఇప్పుడు దేశీయ తయారీతో ఆ అవసరాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఏర్పడింది. ఈ పరికరాన్ని ఏకే–47, ఏకే–203, ఎం పీ–5 వంటి పలు రకాల రైఫిళ్లతో పాటు ఇతర ఆయుధాలకూ అమర్చుకునే విధంగా రూపొందించారు. దీంతో భద్రతా దళాల అవసరాలను దేశీయంగానే తీర్చే అవకాశాలు మరింత పెరిగాయి. ధర పరంగా కూడా ఈ స్వదేశీ పరికరం విశేష ప్రయోజనాన్ని అందిస్తోంది.




విదేశీ ఉత్పత్తులతో పోలిస్తే కేవలం ఐదో వంతు వ్యయంతోనే అందుబాటులోకి వస్తోంది. అంతేకాకుండా విదేశీ పరికరాలకు అవసరమయ్యే ఖరీదైన బ్యాటరీలకు బదులుగా సాధారణ ఏఏఏ బ్యాటరీతోనే ఇది పనిచేయడం మరో ప్రత్యేకత. దీంతో నిర్వహణ వ్యయం కూడా గణనీయంగా తగ్గనుంది. మన్నిక పరంగా కూడా ఈ పరికరం అత్యుత్తమంగా నిలుస్తోందని తయారీ సంస్థ తెలిపింది. సియాచిన్ వంటి తీవ్ర చలి ప్రాంతాల్లో మైనస్ 40 డిగ్రీల నుంచి ఎడారి ప్రాంతాల్లో 85 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలను తట్టుకుని పనిచేసే సామర్థ్యం దీనికి ఉంది. గ్లాస్ దెబ్బతిన్నా లక్ష్యాన్ని గుర్తించగలిగే ప్రత్యేక సాంకేతికతను కూడా ఇందులో అమర్చారు. 'మేక్ ఇన్ ఇండియా' మరియు 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా రూపొందిన ఈ పరికరం భారత రక్షణ స్వావలంబనకు మరో బలమైన అడుగుగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఓటీటీలోకి విశ్వనాథ్ అండ్ సన్స్

హైదరాబాద్, సెప్టెంబరు 11::

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. యు వ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన ఈ కుటుంబ కథా చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించింది. కుటుంబ బంధా లు, భావోద్వేగాలు, జీవితంలోని అనుబంధా లను కమర్షియల్ అంశాలతో మేళవించి రూ పొందించిన ఈ సినిమాకు థియేటర్లలో మంచి స్పందన లభించింది. మాస్ యాక్షన్ సినిమా లతో గుర్తింపు పొందిన సూర్య.. ఈ చిత్రంలో భిన్నమైన పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

### రూ.250 కోట్లకు పైగా వసూళ్లు

'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి రాణించినట్లు చిత్రవర్గాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ. 250 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. సూర్యకు ఉన్న మాస్ ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ కథను ఎంచుకోవడం సినిమాకు కలిసొచ్చిన అంశంగా మారింది. కథలోని భావోద్వేగాలు, కుటుంబ సంబం ధాలకు ప్రేక్షకులు కనెక్ట్ కావడంతో మంచి ఆదరణ లభించింది.




# 'స్వయంభు'లో సంయుక్త వీరనారి అవతారం

హైదరాబాద్, సెప్టెంబరు 11::

నిఖిల్ హీరోగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణ మాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సంయుక్త, నభా నటేశ్ కథానా యికలుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమా దాదాపు రెండేళ్ల పాటు చిత్రీకరణ జరుపుకుని ఇటీవలే పూర్తి చేసుకుంది. సంయుక్త మీనన్ పుట్టినరోజు సందర్భంగా తాజాగా 40 సెకన్ల టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో సంయుక్త వీరనారి పాత్రలో కనిపిస్తూ కత్తి యుద్ధాలు చేయడం ఆకట్టు కుంటోంది.

### కత్తి పట్టిన వీరనారి

ఇప్పటివరకు గ్లామర్, భావోద్వేగ పాత్రల్లో ఎక్కువగా కనిపించిన సంయుక్త.. 'స్వయం భు'లో మాత్రం పూర్తి భిన్నమైన అవతారంలో దర్శనమివ్వనున్నారు. చేతిలో కత్తి పట్టుకుని యుద్ధరంగంలో పోరాడుతున్న ఆమె సన్నివే శాలు టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.






# హైబ్ ఇండియా ఆడిషన్స్‌కు రష్మిక మద్దతు

హైదరాబాద్, సెప్టెంబరు 11::

స్టార్ హీరోయిన్ రష్మిక మందన యువతను ప్రోత్సహించే ఓ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో భాగమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కే-పాప్ గ్రూప్ బీటీఎస్ సహా పలు ప్రముఖ సంగీత బృందాలను పరిచయం చేసిన దక్షిణ కొరియా వినోద సంస్థ హైబ్ (న్‌దీజు) తాజాగా భారత్‌లో ప్రతిభావంతుల కోసం ఆడిషన్స్ నిర్వహిస్తోంది. 'హైబ్ ఇండియా' పేరుతో చేపడుతున్న ఈ కార్యక్రమానికి రష్మిక భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు.

**తొలి అడుగు వేయడానికి ధైర్యం కావాలి:**

ఈ సందర్భంగా రష్మిక తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రతి ప్రయాణం ఓ అవకాశంతో, ఆ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు అవసరమైన ధైర్యంతో ప్రారంభమవుతుందని చెప్పారు. తన కెరీర్‌ను వెనక్కి తిరిగి చూసుకుంటే.. మనపై మనకు నమ్మకం ఉంచడం, కష్టపడి పనిచేయడం, ఊహించని అవకాశాలను సైతం స్వీకరించడం ఎంతో ముఖ్యమని తెలుసుకున్నానని తెలిపారు.

**యువ ప్రతిభకు మంచి అవకాశం:**

భారత్‌లో హైబ్ సంస్థ ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం ఆనందంగా ఉందని రష్మిక పేర్కొన్నారు. దేశంలో ఎంతోమంది యువత, ముఖ్యంగా అమ్మాయిలు కళాకారులు, ప్రదర్శకులుగా ఎదగాలని కలలు కంటున్నారని.. వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ కలలకు ఒక్క అవకాశం ఇవ్వాలని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని యువతకు పిలుపునిచ్చారు. హైబ్ సంస్థ బీటీఎస్‌తో పాటు టీఎక్స్‌టీ, న్యూజీన్స్, ఇల్లిట్ వంటి ప్రముఖ కే-పాప్ బృందాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

**'రణబాలి'లో కీలక పాత్ర:**

సినిమాల విషయానికొస్తే.. రష్మిక ఇటీవల షాహిద్ కపూర్, కృతి సనన్‌తో కలిసి 'కాక్‌టెయిల్ 2'లో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'రణబాలి' చిత్రంలో నటిస్తున్నారు. 1870ల కాలంలో దక్షిణ భారతదేశంలో ఏర్పడిన తీవ్ర కరువు నేపథ్యంలో.. తన ప్రజలను, ప్రాంతాన్ని కాపాడేందుకు ఓ తిరుగుబాటు యోధుడు బ్రిటిష్ కమిషనర్‌ను ఎలా ఎదుర్కొన్నాడనే కథాంశంతో ఈ చిత్రం

# ప్రభాస్ సినిమాల రిలీజ్ డేట్లలో మార్పులు?

హైదరాబాద్, సెప్టెంబరు 11::

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న సినిమాల విడుదల తేదీలపై సోషల్ మీడి యాలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తు న్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'ని తొలుత 2026 డిసెంబరు 3న విడుదల చేయాలని మేకర్స్ భావించారు. అయితే షూటింగ్, నిర్మాణానంతర పనుల్లో జాప్యం కారణంగా సినిమాను 2027 మార్చికి వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

### మార్చికి 'ఫౌజీ' వస్తే..

'ఫౌజీ' విడుదల తేదీ మార్చికి మారితే ప్రభాస్ నటిస్తున్న ఇతర చిత్రాల షెడ్యూల్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సందీ ప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటించ నున్న భారీ బడ్జెట్ చిత్రం 'స్పిరిట్' ఇప్పటికే 2027 మార్చి 5న విడుదల కానున్నట్లు ప్రకటించారు.




# తెలంగాణ బిడ్డనైనా అవకాశాలు రాలేదు: ఉదయభాను

హైదరాబాద్, సెప్టెంబరు 11::

ప్రముఖ యాంకర్, నటి ఉదయభాను టాలీవుడ్‌లో తన ప్రస్తుత పరిస్థితిపై భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఓ ప్రముఖ మీడియా సంస్థ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాతే తనకు సినిమా, బుల్లితెర అవకాశాలు క్రమంగా తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డగా తనకు పరిశ్రమలో ఎలాంటి ప్రత్యేక ప్రయోజనం లభించలేదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మారిన పరిస్థితులు: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడకముందు తాను బుల్లితెరపై ఎన్నో కార్యక్రమాలు, ఈవెంట్లు చేశానని ఉదయ భాను గుర్తుచేశారు. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత స్థానిక కళాకారిణిగా తనకు ఎలాంటి ప్రయోజనం దక్కలేదన్నారు. ప్రభుత్వం అధికా రికంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమా లకు సైతం తనను వ్యాఖ్యాతగా పిలవలేదని వాపోయారు. తెలంగాణ బిడ్డగా పుట్టడం వల్ల తనకు వచ్చిన ప్రయోజనం శూన్యమని పేర్కొన్నారు. అవకాశాలు వచ్చినా.. కొన్ని తిరస్కరించా:





# కాకా కోసం థమన్ బెస్ట్ మ్యూజిక్!

హైదరాబాద్, సెప్టెంబరు 11::

మెగాస్టార్ చిరంజీవి హీరోగా, దర్శకుడు బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'కాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ సినిమాగా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. తాజాగా సంగీత దర్శకుడు థమన్ 'కాకా' సెట్స్‌లో చిరంజీవితో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఇందులో చిరంజీవి, థమన్ ఇద్దరూ ఆనందంగా నవ్వుతూ కనిపించడంతో ఈ ఫొటో వైరల్‌గా మారింది.

### చిరుతో థమన్ సరదా క్షణాలు

షూటింగ్ సమయంలో చిరంజీవితో కలిసి సరదాగా గడిపిన క్షణాలను థమన్ అభిమానులతో పంచుకున్నారు. మెగాస్టార్‌తో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం మరోసారి ఈ ఫొటో ద్వారా బయటపడిందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. గతంలో చిరంజీవి నటించిన 'బ్రూస్ లీ', 'గాడ్ ఫాదర్' చిత్రాలకు థమన్ సంగీతం అందించారు. ఆయా సినిమాల్లో ఆయన అందించిన నేపథ్య సంగీతానికి మంచి స్పందన లభించింది.

### కెరీర్‌లోనే అత్యుత్తమ సంగీతం

'కాకా' కోసం తన కెరీర్‌లోనే అత్యుత్తమమైన పనిని అందిస్తున్నట్లు థమన్ హామీ ఇచ్చారు. అభిమానులను దృష్టిలో పెట్టుకుని సినిమాకు తగ్గట్టుగా అదిరిపోయే సంగీతాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా చిరంజీవి స్క్రీన్ ప్రెజెన్స్‌కు తగ్గ స్థాయిలో నేపథ్య సంగీతం ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ సినిమా పాటలు, నేపథ్య సంగీతంపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.



# వాయువ్ ముఖం తొలిసారి బహిర్గతం

హైదరాబాద్, సెప్టెంబరు 11::

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు తమ అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇన్నాళ్లుగా గోప్యంగా ఉంచిన తమ కుమారుడు వాయువ్ ముఖాన్ని తొలిసారి అధికారికంగా పరిచయం చేశారు. వాయువ్ మొదటి పుట్టినరోజు సందర్భంగా అతడి ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. తండ్రి ఒడిలో హాయిగా ఉన్న చిన్నారి, తల్లితో కలిసి నవ్వుతున్న ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఈ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

### కొడుకుపై వరుణ్ భావోద్వేగ సందేశం

వాయువ్ మొదటి పుట్టినరోజు సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగంతో ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. వాయువ్ తన జీవితంలోకి వచ్చిన తర్వాత ప్రపంచమే మరింత అందంగా మారిందని తెలిపారు. తండ్రిగా మారడం తన జీవితంలోనే అత్యంత గొప్ప అనుభూతి అని పేర్కొన్నారు. వాయువ్‌ను తొలిసారి కళ్లారా చూడకముందే అతడిపై ప్రేమ పెంచుకున్నానని, తన కుమారుడిపై ఉన్న ప్రేమ ఎప్పటికీ అలాగే ఉంటుందని తెలిపారు.

### ప్రేమకు కొత్త అర్థం తెలిసిందన్న లావణ్య

లావణ్య త్రిపాఠి కూడా తన కుమారుడి కోసం హృదయపూర్వక సందేశాన్ని రాశారు. తనను తల్లిగా ఎంచుకున్నందుకు వాయువ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వాయువ్ పుట్టకముందు ప్రేమ గురించి తనకు తెలుసనుకున్నానని.. అతడు తన జీవితంలోకి వచ్చిన తర్వాత ప్రేమకు మరో కొత్త అర్థం తెలిసిందని పేర్కొన్నారు. తనకు బయట జీవిస్తున్న మరో హృదయం వాయువ్ అని చెబుతూ, అతడి నవ్వులు, పసి చేతుల స్పర్శలు, కౌగిలింతలు తమ ఇంటిని ఆనందంతో నింపాయని తెలిపారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467